క్లుప్తంగా

రక్షణగోడ నిర్మించాలి



రక్షణ గోడ నిర్మించాల్సింది ఇక్కడే..

దత్తిరాజేరు: కోమటిపల్లి నుంచి గర్భాం వెళ్లే బీటీ రోడ్డులో వంగర పోతలగెడ్డ వద్ద రక్షణ గోడ నిర్మించాలని వాహన చోదకులు, గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మార్గంలో నిత్యం వందలాది మంది ప్రయాణాలు సాగిస్తున్నారు. పోతలగెడ్డ వద్ద రక్షణ గోడ లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు దీనిపై దష్టి సారించి రక్షణ గోడ నిర్మించాలని కోరుతున్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ లోకేశ్వరరావు

మెరకముడిదాం: బుధరాయవలస ఎస్ఐగా జె.లోకేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, మంపా పోలీస్‌స్టేషన్ నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన బి.లోకేశ్వరరావు ఇప్పటికే గరివిడి పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, అందరూ సహకరించాలని ఎస్ఐ లోకేశ్వరరావు కోరారు.

జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు చింతలపేట విద్యార్థి



త్రోబాల్ పోటీలలో రాణించిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం గౌరిదేవి, పీఈటీ లక్ష్మణ్

గుర్ల: మండలంలోని చింతలపేట హైస్కూల్ విద్యార్థి కె.మురళి జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ కె.లక్ష్మణ్ సోమవారం తెలిపారు. వచ్చే నెల 3,4,5 తేదీలలో హైదరాబాద్‌లో జరిగే జాతీయ పోటీల్లో మురళి పాల్గొంటున్నట్లు చెప్పారు. అలాగే రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో బాలికల విభాగంలో తృతీయ స్థానం సాధించిన పాఠశాల విద్యార్థిని ఎన్. జ్యోతి సాయిని హెచ్ఎం గౌరిదేవి, పీఈటీ కె.లక్ష్మణ్ అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థిని సత్తా



తాను సాధించిన మెడల్‌తో విద్యార్థిని శశికళ

చీపురుపల్లిరూరల్(గరివిడి): రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల్లో గరివిడి మండలంలోని తాటిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సోపేటి శశికళ సత్తాచాటింది. విశాఖపట్నంలోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో ఇటీవల అండర్-18 విభాగంలో జరిగిన పోటీల్లో సదరు విద్యార్థిని పాల్గొని, విశేష ప్రతిభ కనబరిచి మెడల్ సొంతం చేసుకుంది. ఈ మేరకు పాఠశాల సిబ్బంది విద్యార్థిని సోమవారం అభినందించారు. రాబోయే రోజుల్లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

రుచికరమైన భోజనం వడ్డించాలి



కరకవలస పాఠశాలలో విద్యార్థినితో పాఠ్యాంశాన్ని చదివిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: పాఠశాలల పిల్లలకు రుచికరమైన మధ్యాహ్నభోజనం వడ్డించాలని ఎంఈఓలు జగదీశ్వరరావు, బాలభాస్కరావు సూచించారు. బక్కునాయుడుపేట ప్రాథమిక పాఠశాలలను జగదీశ్వరరావు, కరకవలస పాఠశాలలను బాలభాస్కరరావు సోమవారం సందర్శించారు. మధ్యాహ్నభోజనాలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలిచ్చారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు.

నేటినుంచి మండల స్థాయి క్రీడాపోటీలు

చీపురుపల్లి: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడాపోటీలు మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు స్వరూప్ ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. అండర్-14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, చదరంగం, అథ్లెటిక్స్ తదితర క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీల్లో అన్ని పాఠశాలల బాలబాలికలు పాల్గొనవచ్చన్నారు. ఇక్కడి పోటీల్లో గెలుపొందిన వారు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

అన్నదాతకు రూ.20 వేలు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు



జామి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతుసంఘం నాయకుడు రాంబాబు, తదితరులు



ఎస్.కోట తహసీల్దార్ కార్యాలయంలో ధర్నా చేస్తున్న రైతులు, రైతు సంఘ నాయకులు

గంట్యాడ: అన్నదాతకు పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే ఇవ్వాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్దరాజు రాంబాబు డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పంటలకు ఉచిత పంటల బీమాను అమలు చేయాలని, రూ.2 లక్షల వరకు రైతు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మోటార్లకు మీటర్ల ఏర్పాటుకు సంబంధించిన జీఓ 22 రద్దు చేయాలని, భూయాజమాని సంతకంతో నిమిత్తం లేకుండా వాస్తవ సాగుదారులకు కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వారికి అన్ని రకాల సంక్షేమ పథకాలు వర్తింపుచేయాలని కోరారు. సహకార రంగంలో ఉన్న భీమసింగి షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని, ఎన్‌సీఎస్ షుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని క్రషింగ్ ప్రారంభించాలన్నారు. 2021 ఖరీఫ్‌కు ధాన్యం విక్రయాలకు సంబంధించి రైతులకు రవాణా, హమాలీ ఛార్జీలు చెల్లించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం అధ్యక్షుడు కోడెల శ్రీను, కార్యదర్శ సారి రవిరాజు, రైతు సంఘం నాయకులు గంగునాయుడు, బంగారునాయుడు, సూరిదేముడు, గండి ఎర్నాయుడు, కె.పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జామి: ప్రభుత్వం ప్రకటించిన రూ.20వేలు అన్నదాత సాయంను రైతులకు తక్షణమే అందజేయాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు బి.రాంబాబు డిమాండ్ చేశారు. రైతు సమస్యలు పరిష్కారించాలంటూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ కృష్ణలతకు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రం అందజేశారు.

రైతు సమస్యలు పరిష్కరించాలని ధర్నా

శృంగవరపుకోట: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి, రైతాంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి మద్దిల రమణ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో పలువురు రైతులు, రైతు సంఘ నాయకులు, సీపీఎం అనుబంధ సంఘాల కార్యకర్తలతో కలిసి సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ అన్నదాత పెట్టుబడి సాయం కింద తక్షణమే రూ.20వేలు రైతులకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో కె.రామారావు, గేదెల బంగారమ్మ, కె.రామకృష్ణ, కె.సుంకరయ్య, జి.అచ్చమ్మ, ఒంటి దేముడు, జి.బంగారుబాబు, ఒంటి పైడితల్లి, జి.లక్ష్మణ్, జి.బంగారయ్య, జి.అప్పలనాయుడు, ఆర్.వెంకటరావు, ఎర్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కేజీబీవీ విద్యార్థిని



రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన యేసు రత్నంతో ప్రత్యేకాధికారి బేగం, పీఈటీ రామలక్ష్మి

మెరకముడిదాం: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కేజీబీవీ విద్యార్థిని కె.యేసురత్నం ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రత్యేకాధికారి గౌసియాబేగం, పీఈటీ బి.రామలక్ష్మి సోమవారం తెలిపారు. ఇటీవల విజయనగరంలోని విజ్జి స్టేడియంలో జరిగిన అండర్-17 ఫుట్‌బాల్ పోటీల్లో యేసురత్నం ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈనెల 28 నుంచి 30 వ తేదీ వరకు పల్నాడు జిల్లా వినుకొండలోని లయోలా పాఠశాలలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో తమ విద్యార్థిని పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని యేసురత్నాన్ని ప్రత్యేకాధికారి గౌసియాబేగం, పీఈటీ రామలక్ష్మితో పాటు, పాఠశాల ఉపాధ్యాయినులు, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు.

200 మందికి ఆరోగ్య తనిఖీలు

గజపతినగరం: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గజపతినగరం సచివాలయం వద్ద సోమవారం 200 మందికి ఉచితంగా వైద్య సేవలందించినట్లు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, నియోజకవర్గ కోకన్వీనర్ సరిది దుర్గారావు తెలిపారు. స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలతో పాటు మందులు ఉచితంగా అందించారు. అనంతరం దావాలపేట గ్రామం సమీపంలో ఉన్న మహంకాళీ అమ్మవారి దేవస్థానం వద్ద స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పి.గోపాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక సీహెచ్‌సీలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించి, పారిశుద్ధ్య సిబ్బందికి ఆరోగ్య తనిఖీలు చేశారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

నియోజకవర్గ స్థాయి పోటీలకు బక్కునాయుడుపేట బాలికలు



నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన బాలికలతో ప్రిన్సిపాల్ ఉషారాణి, పీఈటీ అరుణ

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు నియోజకవర్గ స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలకు ఎంపికై నట్టు ప్రిన్సిపాల్ ఉషారాణి సోమవారం తెలిపారు. స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 68వ మండలస్థాయి పోటీల్లో అండర్-17 విభాగంలో వాలీబాల్ పోటీల్లో ఏడుగురు, చెస్‌లో నవ్య, కబడ్డీలో దీపిక మహేశ్వరి, అనుషా, కోమలి, పరుగు పందెంలో పేరోని, దీపిక, యోగాలో మరో ఆరుగురు, అథ్లెటిక్స్‌ల్ 8 మంది విద్యార్థులు సత్తాచాటారన్నారు. వీరిందరినీ ఈ నెల 28న కొత్తవలసలో జరగనున్న నియోజకవర్గ స్థాయి పోటీలకు సిద్ధం చేస్తున్నట్టు పీఈటీ అరుణ తెలిపారు.

ధర్మవరం కోమటి చెరువుకు గండి



కోమటి చెరువు గండిని పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ, తదితరులు

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం గ్రామ సమీపంలో ఉన్న కోమటి చెరువుకు సోమవారం గండి పడింది. వెంటనే గుర్తించిన రైతులు, గ్రామస్తులు హుటాహుటిన చెరువవద్దకు చేరుకుని ఇసుక బస్తాలు వేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. చెరువు ఆక్రమణల వల్ల నీటి నిల్వ సామర్థ్యం తగ్గి గండి పడే పరిస్థితి ఏర్పడిందని వైస్ ఎంపీపీ సుధారాణి తెలిపారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సామాజిక సేవకు ముందుకురావాలి



చిన్నారులకు టీషర్టులు అందిస్తున్న దృశ్యం

చీపురుపల్లిరూరల్(గరివిడి): సామాజిక సేవా కార్యక్రమాలు చేసేందుకు ముందుకురావాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, ఎంఈవో పి.రామారావులు పిలుపునిచ్చారు. గరివిడి మండలంలోని శేరీపేటలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఇంటర్నేషనల్ యూత్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ సమకూర్చిన టీషర్టులను వారి చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో ఆర్థికంగా బాగున్నవారంతా గ్రామ అభివృద్ధికి తోడ్పడే కార్యక్రమాలు చేసేందుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. డీకేఎస్ సంస్థ గ్రామంలో మధ్యతరహా పరిశ్రమను ఏర్పాటు చేసి, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పయనిస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సన్యాసిరావు, సర్పంచ్ పిల్ల రామయ్యమ్మ, డీకేఎస్ సంస్థ ఫౌండర్ దబ్బాడ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

లక్కవరపుకోట: అక్రమంగా మద్యం తరలిస్తున్న రంగాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని సోమవారం అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ నవీన్‌పడాల్ తెలిపారు. మండలంలోని సంతపేట గ్రామ సమీపంలోని లేఅవుట్‌లో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1600 స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

సామాజిక తనిఖీలు

చీపురుపల్లి: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఈ నెల 23వ తేదీ నుంచి ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, సామాజిక తనిఖీలు చేస్తున్నట్లు ఏపీవో భాగ్యలక్ష్మి ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అక్టోబరు 1వ తేదీన మండల స్థాయిలో ఆడిట్‌పై బహిరంగ విచారణ ఉండే అవకాశం ఉంటుందన్నారు.

ఇంటర్మీడియట్‌తో ఉపాధి

- సార్వత్రిక విద్యాపీఠం రాష్ట్ర పరిశీలకుడు జి.గోపీకృష్ణ



సార్వత్రిక విద్య గోడపత్రికను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు గోపీకృష్ణ, తదితరులు

కొత్తవలస: ప్రస్తుత రోజుల్లో 10వ తరగతితో పాటు కనీసం ఇంటర్మీయట్ ఉత్తీర్ణులైతే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని సార్వత్రిక విద్యాపీఠం రాష్ట్ర పరిశీలకుడు జి.గోపీకృష్ణ తెలిపారు. కొత్తవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సార్వత్రిక విద్యాకేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రాపౌట్స్ విద్యార్థులకు దూరవిద్యా కోర్సుల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. 14 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ 10వ తరగతితో పాటు ఇంటర్మీడియట్ విద్యను పూర్తిచేయాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వం దూర విద్యను ప్రోత్సహిస్తోందని తెలిపారు. ప్రస్తుత ఏడాదికి సంబంధించి దూరవిద్యలో ప్రవేశాలు పొందేందుకు 28వ తేదీ వరకు అవకాశం ఉందని, అపరాధ రుసుం రూ.200లతో 30వ తేదీ వరకు అవకాశం ఉన్నట్టు వెల్లడించారు. ఈ మేరకు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సార్వత్రిక విద్య మండల సమన్వయకర్త బి.గోవిందనాయుడు, ప్రధానోపాధ్యాయులు చీపురపల్లి ఈశ్వరరావు, జిల్లా సమన్వయకర్త శివప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'

గజపతినగరం/లక్కవరపుకోట/కొత్తవలస: గజపతినగరం వ్యవసాయశాఖ సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న నాలుగు మండలాల్లో మంగళవారం నుంచి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వ్యవసాయశాఖ ఏడీఏ కె.మహారాజన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఫార్మసీ విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఈశ్వరకుమార్

గజపతినగరం: ఫార్మసీ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు మెడికల్ రంగంలోనే కాకుండా సాఫ్ట్‌వేర్ రంగంలో కూడా ఉద్యోగాలు పొందవచ్చని ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.ఈశ్వరకుమార్ అన్నారు. మండలంలోని సీతారామపురం శ్రీసాయి ఫార్మసీ కళాశాలలో సోమవారం నిర్వహించిన 'నేషనల్ ఫార్మసీ విజిలెన్స్ వీక్' సెలబ్రేషన్స్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సాంకేతిక పురోభివృద్ధితో ఫార్మసీ విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ రంగంలో అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు ఆ దిశగా స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని సూచించారు. ఫార్మకోవిజిలెన్స్ అనేది ఫార్మసిస్టులందరికీ చాలా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.లక్ష్మీదీప్తి, కళాశాల డైరెక్టర్ కె.వినోద్ కుమార్, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా

- డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.రాఘవులు



డీఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న రాఘవులు

చీపురుపల్లి: గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా పెడతామని, గంజాయి తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. స్థానిక డీఎస్పీగా ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం కాసేపు మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని, సైబర్ నేరాల కట్టడికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విజిబుల్ పోలీసింగ్ నిర్వహణకు చర్యలు చేపడతామన్నారు. పోలీస్ సిబ్బంది కూడా పారదర్శకంగా విధులు నిర్వహించాలని, తామున్నామనే ధైర్యాన్ని ప్రజలకు కల్పించాలని కోరారు. ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన ఏఎస్ చక్రవర్తి ఏఎస్పీగా పదోన్నతిపై వేరే ప్రాంతానికి వెళ్లగా, ఈయన స్థానంలో డీఎస్పీగా చక్రవర్తి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

పుస్తక పఠనంతో అపార జ్ఞానం



పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న రమణ

చీపురుపల్లిరూరల్(గరివిడి): పుస్తక పఠనం ద్వారా అపారమైన జ్ఞానం లభిస్తుందని ఆశయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ అన్నారు. గరివిడి మండలంలోని కుమరాం గ్రామంలో ఆశయ రూరల్ లైబ్రరీ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తక పఠనంపై సోమవారం అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పుస్తకాలు చదవడాన్ని అలవాటు చేసుకోవాలని, పుస్తకాల ద్వారానే జ్ఞానసముపార్జన సాధ్యమవుతుందన్నారు. పిల్లలంతా మొబైల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, చదువుపై దృష్టిసారించాలని సూచించారు.

అంగన్‌వాడీ కార్యకర్త మృతి



పద్మలత(ఫైల్)

చీపురుపల్లి: మండలంలోని మెట్టపల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త జి.పద్మలత(49) సోమవారం మృతి చెందారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లోని ఆమె కుమారుడి నివాసంలో ఉదయం మృతి చెందినట్లు గ్రామస్తులు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు తెలిపారు. ఆమె మృతి పట్ల ఐసీడీఎస్ సిబ్బంది సంతాపం ప్రకటించింది.